క్లుప్తంగా

15 నుంచి 144 సెక్షన్

తెనాలి రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో తెనాలిలోని పరీక్ష కేంద్రాల వద్ద ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తహసీల్దార్ కె.రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులన్నింటినీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూసి వేయాలని ఆదేశించారు. ప్రజలు గుంపులుగా ఉండరాదని స్పష్టం చేశారు.

తాత్కాలిక ఆవాసాల కోసం సాయం



తెనాలి: కాలువ కట్టలపై, చెట్ల కింద చిన్నచిన్న గుడిసెల్లో తలదాచుకుంటున్న పది పేద గిరిజన కుటుంబాలకు ట్రైబల్స్ చారిటబుల్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం తాత్కాలిక వసతిని ఏర్పాటుచేశారు. చెట్ల కిందనే నివాసముంటూ వర్షాలు, ఎండలకు అవస్థలు పడుతున్న గిరిజనుల దయనీయ పరిస్థితిని గమనించిన ట్రస్ట్ అధినేత అంజలి రావూరి తాత్కాలిక వసతికి అవసరమైన వెదురు వాసాలు, పైకప్పునకు పరదా పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రావూరి సురేష్‌బాబు, ట్రస్ట్ సభ్యులు బొంత కృపమ్మ, అద్దంకి పద్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



తెనాలిఅర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని తెనాలి మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని సరస్వతీ శిశు మందిర్ 11వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కారం నేర్పించే పాఠశాల శ్రీ సరస్వతీ శిశు మందిర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు డాక్టర్ సమల లక్ష్మణబాబు, ప్రధాన ఉపాధ్యాయుడు రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిటౌన్: 11వ వార్డులోని డొంక రోడ్డులో పేదలు వంద మందికి ఆదివారం శ్రీవేంకటేశ్వరయోగా సేవా కేంద్రం సభ్యులు కన్నెగంటి పిచ్చయ్య మాస్టారు సహకారంతో అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్ భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. చిరంజీవి అఖిల్‌నంద పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. యోగా సభ్యులు పుట్టిన రోజు, పెళ్లిరోజులలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని హరీష్ పేర్కొన్నారు. గత 20 ఏళ్ల నుంచి పిచ్చయ్య మాస్టారు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, పిచ్చయ్య, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

కొలకలూరులో ఉచిత వైద్యశిబిరం



తెనాలిఅర్బన్: న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం దగ్గర ఆదివారం ఉచిత పిల్లల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రాధిక రాజశేఖర్, డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ కోగంటి అశోక్ చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కుప్పా రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

భట్టిప్రోలు: ట్రాక్టర్ ట్రక్కు తగిలి తీవ్రంగా గాయపడిన ఓ ద్విచక్ర వాహనదారుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. భట్టిప్రోలు ఎస్‌ఐ వై.సురేష్ కథనం ప్రకారం అద్దేపల్లి ఇందిరా కాలనీకి చెందిన పినగాల విమల్‌రాజు(20) తాపీ పని చేస్తుంటాడు. ఆదివారం చావలి బస్టాండ్ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు.

వైఎస్సార్ సీపీ వరాల పాలన



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కఠెవరంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి, వైఎస్సార్ సీపీ నాయకులు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలిఅర్బన్/తెనాలి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఛైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించి వారి జీవన ప్రమాణాలను పెంచుతున్నారని వివరించారు. జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. నవరత్నాలను అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే అమలు చేస్తూ పేద ప్రజల గుండెల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ అవుతు గీత, కౌన్సిలర్లు అత్తోట నాగవేణి, ఆవుల కోటయ్య, పేరం సంజీవరెడ్డి, వీర్లపాటి విజయలక్ష్మి, దాసరి వసంతరావు, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలగురవమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు అడుసుమల్లి శ్రీనివాసరావు, మల్లిబోయిన రాము, దేవరపల్లి కిషోర్, కుర్రా శ్రీను, కఠారి హరీష్, కాళిదాసు వెంకటేశ్వరరావు, తాడిబోయిన పోలు రాజు, కాళిదాసు వెంకటసత్యం, శ్రీనివాసరెడ్డి, కనపర్తి అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ తెనాలి నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించి బలమైన రాజకీయ పార్టీగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానంపూడి రఘురామిరెడ్డి, కోలా వాసు, పెసర్లంక రమణ, ఎల్‌బీసీ చిన్నా తదితరులు పాల్గొన్నారు.
- కఠెవరం గ్రామంలోని మర్లమ్మ గుడి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు ఆవిష్కరించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శివనాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, ఉపసర్పంచ్ మంచాల వెంకట సురేష్, ఎల్‌బిసి చిన్ని, షేక్ ఆదం షఫీ, పసుపులేటి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, తుల్లిమిల్లి సువర్ణబాబు, మేకల శివరామయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- గుడివాడ మెయిన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ బురదగుంట రమేష్, రుద్రపాటి మోషె, మత్తే ధనకిషోర్, బండికళ్ళ సతీష్, కడియాల శివరామబ్రహ్మం, బురదగుంట దావీదు, కొలకలూరి బుచ్చయ్య, బురదగుంట మాతయ్య, తోడేటి నాగేశ్వరరావు, బండి అబ్రహం పాల్గొన్నారు.

హ్యాపీ హాస్పిటల్లో ఫ్లూ షాట్ డ్రైవ్



ఫ్లూ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ పావని ప్రియాంక

తెనాలిఅర్బన్: గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పిటల్స్‌లో ఫ్లూ షాట్ డ్రైవ్‌ను నాలుగు వారాల పాటు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావని ప్రియాంక తెలిపారు. వైద్యశాలలో ఆదివారం ఫ్లూ వ్యాక్సిన్‌ను సగం ధరకే కొందరికి వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తీవ్ర జ్వరం వంటివి ఫ్లూ లక్షణాలుగా తెలిపారు. వాటి బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సిన్‌ను సగం ధరకే వేస్తున్నట్లు చెప్పారు. దీని ధర రూ.2,200 ఉండగా తమ హాస్పిటల్‌లో రూ.1100లకే వేస్తున్నట్లు చెప్పారు. నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి కార్యదర్శి ఎం.భానుమతి, వైద్యశాల సిబ్బంది సురేంద్ర, జానకి పాల్గొన్నారు.

బండ్లమ్మకు ప్రత్యేక పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసిన బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాసం మూడో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

నాటక కళాకారుడు రవికుమార్‌కు సన్మానం



రవికుమార్, బాపూజీ, రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ తయారు చేసిన నాయకులు అనే అంశంపై కాల్వ బాలాజీ, తాళ్ళూరి రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు పినపాటి రవికుమార్‌తోపాటు వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదాల కోటేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, వీరమచినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొలనుకొండలో శివస్వామి హడావుడి

- ఆరు నెలల నుంచి ఒక్కొక్క విగ్రహం ఏర్పాటుచేసిన వైనం
- తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులు
- విలువైన భూమిని ఆక్రమించుకోవడానికే అంటున్న తహసీల్దార్



నూతనంగా ఏర్పాటు చేసిన శివయ్య విగ్రహం

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో ఇరిగేషన్ భూమిలో పురాతన దేవాలయం ఉంది. దాన్ని పునః నిర్మిస్తున్నాం. అధికారులు కూల్చివేశారంటూ ఆదివారం తాళ్లయపాలెం శివస్వామి హడావుడి చేశారు. ఈ సందర్భంగా శివస్వామి విలేకరులతో మాట్లాడుతూ కొలనుకొండలో శివయ్య ఆలయం నిర్మాణం చేస్తామంటే అధికారులు ఊరుకోవడం లేదని, చూద్దాం చూద్దాం అని అనడంతో మాకు సహనాలు పోతున్నాయని, హిందూ ధర్మంపై దాడులు చాలా భయంకరంగా జరుగుతున్నాయని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్కడ గతంలో ఎటువంటి విగ్రహాలు లేవని, ఆరు నెలల క్రితం ఒక నంది విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తీసుకువచ్చి పెట్టారని, మూడు వందల సంవత్సరాల క్రితం అక్కడ విగ్రహం ఉంటే మా పెద్దలు ఎందుకు గుర్తించలేదు? మేము పొలానికి వెళ్లినప్పుడు ఎందుకు కనిపించలేదు? ఆరు నెలల క్రితం ఒక నంది విగ్రహం ఏర్పాటు చేశారు. అనంతరం ఒక ఆంజనేయస్వామి విగ్రహాన్ని కూడా పెట్టారు. ఇప్పుడు శివలింగం ఉందంటున్నారు. మా గ్రామస్తులు కాకుండా ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ విగ్రహాలు ఉన్నాయని చెప్పడం వెనుక ఏముందో అర్థం కావడం లేదని, దేవుడి మీద భక్తి వున్నవాళ్లు మా గ్రామంలో ఉన్న పలు దేవాలయాలను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నామని స్థానికులు వాపోతున్నారు.

తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి ఏమన్నారంటే..

ఇదిలా ఉండగా తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి రూరల్‌పరిధిలోని కొలనుకొండ గ్రామంలోని 22 సర్వే నెంబర్‌లో ఇది ఇరిగేషన్ చానల్‌కు చెందిన భూమి, కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేశారు. దానికి కమ్యూనల్ రంగు తీసుకువచ్చి శివలింగం ప్రతిష్టిస్తాం అంటూ మాట్లాడుతున్నారు. శివకోటి రెడ్డి అనే వ్యక్తి కొలనుకొండలో మేము అన్నదానం ఏర్పాటు చేసుకుంటున్నాం అనుమతి ఇవ్వాలని రెండు మూడు సార్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారని, మీరు ప్రైవేటు భూముల్లో ఏర్పాటు చేసుకోవాలని చెప్పామని, శివకోటి రెడ్డి దానికి మతం రంగు పూసి శివస్వామిని పిలిపించి కమ్యూనల్ గొడవ సృష్టిస్తున్నారని, అది చాలా తప్పుగా భావిస్తున్నామని అన్నారు. గతంలో అక్కడ ఎలాంటి విగ్రహాలు లేవని స్పష్టం చేశారు.

ఆటో అదుపు తప్పి.. నలుగురికి గాయాలు



గాయాలైన వారికి ప్రథమ చికిత్స నిర్వహిస్తున్న దుగ్గిరాల 108 సిబ్బంది

తాడేపల్లి రూరల్: ఆటో బోల్తా పడి నలుగురు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. తెనాలి– మంగళగిరి రోడ్డులో మంచికలపూడి సమీపంలో ద్విచక్ర వాహనదారుడు షడన్ బ్రేక్ వేయడంతో తప్పించబోయిన ఆటో ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో డ్రైవర్‌తో కలిపి ఆరుగురు ఉండగా నలుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న దుగ్గిరాల 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో మంచికలపూడికి చెందిన గైరిబోయిన రమాదేవి, తులుసూరి సాంబశివరావు,, యేమినేని పార్వతి, యార్లగడ్డ శివనాగేశ్వరరావుతో పాటు ఆటో డ్రైవర్ కేసన ఆంజనేయులు ఉన్నారు.

భట్టిప్రోలు గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం



భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని టీఎంరావు హైస్కూల్‌లో 1984–1985 విద్యా సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు నిర్ణయించారు. వారు ఆదివారం హైస్కూల్‌లో ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 60 మంది విద్యార్థులు హైస్కూల్లో కలిసి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమతోపాటు చదువుకున్న రామచంద్రుల లలితా మహాలక్ష్మి సూపరింటెండెంట్ స్థాయి నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా ఆమెను సన్మానించారు.

అపూర్వ సమ్మేళనం



రేపల్లె రూరల్: పట్టణంలోని అనగాని భగవంతరావు డిగ్రీ కళాశాలలో 1979–82 సంవత్సరాలలో బీకాం చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలిశారు. అప్పటి ప్రిన్సిపాల్ శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. చదువుకున్న రోజుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని పులకించిపోయారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్తమాసు సాయిబాబు, తూనుగుంట్ల సాయిబాబు, వెంకటేశ్వరరావు, శంకరరావు, సీహెచ్ ఆంజనేయులు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయి ఆలయంలో వార్షికోత్సవం



తెనాలిటౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ సాయినగర్‌లోని షిరిడి సాయిబాబా ప్రధాన ఆలయంలో ఆదివారం తృతీయ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం ఆలయంలో కాకడ హారతి, అభిషేకం, అలంకారం చేసి పూజలు చేశారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వెంపటి సత్యనారాయణ బృందంచే సాయి భజనామృత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహానైవేద్యం, హారతి, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను దేవాలయ వ్యవస్థాపకులు, ఛైర్మన్ కె.లక్ష్మణ్ పర్యవేక్షించారు.

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

మంగళగిరి: నగరంలోని పెదవడ్లపూడి సెంటర్‌లోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మల వృద్ధాశ్రమంలో 50 మంది వృద్ధులకు కళ్లజోళ్లు ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. తొలుత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వింజమూరి వినయ్‌కుమార్, ఇండ్ల శ్రీనివాసరావు, ఆకురాతి శంకరరావు, రామనాథం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు గ్రామ నూతన సచివాలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ప్రముఖ గుండె వైద్యనిపుణులు సుధీర్ 130 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. శిబిరంలో డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ సుధీర్, డాక్టర్ వంశీకుమార్, డాక్టర్ ఆసిఫా పాల్గొన్నారు. కార్యక్రమంలో డోకిపర్రు ఎంపీటీసీ నోసిన రామకోటమ్మ, గ్రామ సర్పంచి కొండెపోగు సామ్రాజ్యం, ఉడతా శ్రీనివాసరావు, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ నోసని కోటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడు మృతి

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రులో కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పొత్తూరి రాజు(28) కుటుంబ కలహాలతో ఈ నెల 9వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబసభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజు ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరంలో 450 మందికి పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జీవనలత



వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలు

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థ రెయిన్‌బో ట్రస్ట్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. చెంచుపేటలోని శబరి వృద్ధాలయ ప్రాంగణంలో జరిగిన వైద్యశిబిరంలో గుంటూరు ఒమేగా హాస్పిటల్, సుదర్శిని కంటి ఆస్పత్రి, తెనాలిలోని హెల్త్ హాస్పిటల్, అవినాష్ నర్సింగ్ హోమ్, లతాస్ డయాబెటిక్ కేర్ ఆస్పత్రుల వైద్యనిపుణులు క్యాన్సర్ స్క్రీనింగ్, థైరాయిడ్, షుగర్, ఎముకలు, హృద్రోగాలు, సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు చేశారు. తెనాలి, పరిసరాల నుంచి మొత్తం 450 మంది రాగా వీరిలో 125 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్, 100 మందికి కాటరాక్ట్ పరీక్షలు చేయగా మిగిలిన వారికి డయాబెటిక్, ఆర్థో, సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శబరి వృద్ధాలయం నిర్వాహకుడు కొల్లా ధర్మకుమార్ సౌజన్యంతో ఏర్పాటైన వైద్యశిబిరాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత, కళ్యాణి, వరలక్ష్మి, వసంత పర్యవేక్షించారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి

తాడేపల్లి రూరల్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని రంగాలు పోరాడాల్సిన అవసరం ఉందని ఏపీ రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పేర్కొన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదిన్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుందని అన్నారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మూడు నల్లచట్టాలు తెచ్చిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అన్నారు. ఆదివారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని అన్నారు. కార్యక్రమంలో మోర్ల శ్రీనివాసరావు, ఇజ్జిగాని శంకర్, ఈడే వెంకటప్పయ్య, జె.వెంకటేశ్వరరావు, రామారావు, ఎస్ సైదా పాల్గొన్నారు.

రుక్మిణీ హరణం అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



మంగళగిరి: స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా ఆదివారం రుక్మిణీ హరణం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన దొడ్డాకుల రంగారావు, సాంబశివరావు, రామోహన్‌రావు వ్యవహరించగా ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన దివంగత అంగలూరు శ్రీనివాసాచార్యులు వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించగా ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

తిరుమలకు పది టన్నుల కూరగాయలు

మంగళగిరి: నగరంలోని పానకాల లక్ష్మీనృసింహస్వామి ఘాట్ రోడ్డు పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి తిరుమలకు పది టన్నులు కూరగాయలు పంపారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వరస్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో సుమారు రూ.1.25లక్షల విలువైన కూరగాయల లారీని పంపారు. తిరుమల తిరుపతిలో భక్తులకు అన్నప్రసాదం కొరకు కూరగాయలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తసమాజం ప్రతినిధులు చలసాని వెంకటేశ్వరరావు, దామర్ల మహేస్, బిట్రా శ్రీనివాసరావు, ఉద్దంటి శ్రీనివాసరావు, మునగాల సాంబశివరావు, కంట్లకుంట రమేష్, మాచర్ల రామకృష్ణ, అద్దె వెంకటేశ్వరరావు, భూదాటి రవి పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే నాలెడ్జి కార్నివాల్



నమూనాలను పరిశీలిస్తున్న స్కూల్ సెక్రెటరీ రవికుమార్, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్

మేడికొండూరు: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని యాపిల్ విద్యాసంస్థల సెక్రెటరీ ఇమ్మడి రవికుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్లలోని యాపిల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం యాపిల్ నాలెడ్జ్ కార్నివాల్ -2023 నిర్వహించారు. కార్నివాల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శవంతంగా తీసుకోవాలని కోరారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ మోరపాకుల అజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా, ఇష్టంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కార్నివాల్ నాలెడ్జ్‌లో సుమారు 250 నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థులు ఏర్పాటుచేసిన నమూనాలను ప్రదర్శించారు.